క్లుప్తంగా

శివకేశవ ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభం తీసుకొస్తున్న భక్తులు

భీమిని: మండలంలోని జగ్గయ్యపేట శివకేశవ ఆలయంలో శనివారం లక్ష్మీనారాయణ శివ పంచయాతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం అప్పాల శ్యామ్ ప్రణీత్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా ముగిసింది. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పాతమంచిర్యాల: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీరామ డిఫెన్స్ అకాడమీకి చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని అకాడమీ కోచ్ భాస్కర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 1న హైదరాబాద్‌లోని జింఖాన గ్రౌండ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి, కార్యదర్శి మారయ్య అభినందించారు.

ప్లాస్టిక్ కవర్లు ఏరివేత


ప్లాస్టిక్ కవర్లు ఏరేస్తున్న ఫారెస్టు అధికారులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి అటవీ రేంజి పరిధిలో శనివారం రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందన్‌పల్లి నుంచి ఊట్నూర్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ప్లాస్టిక్ బాటిల్, ఇతర వస్తువులను ఏరివేసి గ్రామ పంచాయతీ అధికారులకు అప్పజెప్పారు. వాహనదారులు అడవిలో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని, వన్య ప్రాణులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు రవి, హన్మంతరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్దిపల్లి గ్రామంలోని అతిపురాతన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆంజనేయ విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయం శిథిలావస్థకు చేరడంతో స్థానికుల సహకారంతో నూతన ఆలయం నిర్మించగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మూడు రోజుల పాటు వేద పండితులు రామాచార్యులు, దీక్షిత్‌శర్మల సమక్షంలో జరపనున్నారు. ఆంజనేయస్వామి విగ్రహం, నవగ్రహ, ధ్వజ శిఖర పునఃప్రతిష్ఠలో భాగంగా మొదటి రోజు శనివారం శాంతిమంత్ర పఠనం, గణపతి పూజా, యాగశాల ప్రవేశం, నవగ్రహ, యోగినీ వాస్త క్షేత్రపాలక, సర్వతోభద్ర మంటప హవనం, అగ్ని ప్రతిష్ఠా, జలాధివాసం, మంగళహారతి, మంత్రపుష్ప ఘట్టాలను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు.

దోస్త్ అడ్మిషన్లు ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఫేజ్–2 అడ్మిషన్లకు జూన్ 13 చివరి తేదీ అని కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ. పట్వర్దన్ తెలిపారు. ప్రవేశాల కోసం విద్యార్థులు అవసరమైన పత్రాలు, తగిన రుసుముతో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ఉన్నట్లు బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్సీ, ఎంపీసీ, బీజెడ్‌సీఎస్, ఎంపీసీఎస్ గ్రూపులు ఉన్నాయన్నారు. విద్యార్థులకు స్వయం ఉపాధి కోసం ఈ సారి కొత్తగా బీకాం రిటైల్ కోర్సును ప్రవేశ పెడుతున్నామని తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్మార్ట్.. జర్నీ

- జిల్లా వాసులకు చేరువైన రాపిడో
- మంచిర్యాలలో ఆటో, బైక్‌ల ద్వారా సేవలు
- సమీప ప్రాంతాలకూ విస్తరణ
- నిరుద్యోగులు, చిరుద్యోగులకు ఉపాధి

జిల్లా కేంద్రంతోపాటు సమీప ప్రాంతాలకు రాపిడో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆటో, బైక్‌లు గమ్యస్థానానికి తీసుకెళ్తున్నాయి. హైదరాబాద్, వరంగల్ వంటి పెద్ద నగరాలకు మాత్రమే అందే సేవలు జిల్లా కేంద్రాలకు విస్తరించాయి. ప్రస్తుతం రాపిడో ద్వారా ఆటో, బైక్ ద్వారా సేవలను అందిస్తుండగా, ఈ ప్రాంత నిరుద్యోగులు, చిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది.

– మంచిర్యాలటౌన్



రాపిడో



బైక్, ఆటో ద్వారా ఉపాధి పొందాలనుకునే వారికి రాపిడో క్యాప్టన్ యాప్

స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు..

రాపిడో ద్వారా ఆటో, బైక్ బుక్ చేసుకుంటే మనం ఉన్నచోటుకే వచ్చి గమ్యస్థానానికి చేరవేస్తాయి. ఇందుకు గాను దూరాన్ని బట్టి ధర నిర్ణయించి తీసుకుంటారు. స్మార్ట్‌ఫోన్ ఉంటే ప్లే స్టోర్‌లో రాపిడో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆప్షన్స్‌ను ఎంపిక చేసుకోవాలి. రాపిడో సేవలు అవసరమైతే యాప్‌ను ఓపెన్ చేసి మన లొకేషన్ నుంచి ఎక్కడికి వెళ్లాలో ఆటో, బైక్‌నో ఎంపిక చేసుకుంటే ప్రయాణ చార్జి కనిపిస్తుంది. ఓకే ఆప్షన్ నొక్కగానే మనం ఎంపిక చేసుకున్న ఆటో, బైక్ రైడర్ మన రిక్వెస్ట్‌ను ఆక్సెప్ట్ చేస్తారు. ఎంత సేపట్లో మనం ఉన్న చోటుకు వాహనం వస్తుందని సమయంతో సహా కనిపించడంతోపాటు ఆ వాహనం వచ్చే లొకేషన్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. మనం ఉన్నచోటుకే వాహనం వచ్చి, మనం ఎంచుకున్న గమ్యస్థానానికి చేరవేస్తుంది. ఇందుకు గాను రాపిడో యాప్‌లో చూపించిన చార్జీని చెల్లిస్తే సరిపోతుంది.

నిరుద్యోగులు, చిరుద్యోగులకు ఉపాధి..

జిల్లా కేంద్రంతోపాటు సమీప ప్రాంతంలో ఉండే నిరుద్యోగులకు రాపిడో ద్వారా ఉపాధి లభిస్తోంది. రాపిడో క్యాప్టన్ అనే యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ఆటో గాని, బైక్ గాని వివరాలను అందులో నమోదు చేసి, డ్రైవింగ్ లైసెన్స్, మొబైల్ నంబర్ వివరాలను నమోదు చేస్తే లాగిన్ ఇస్తారు. దీనిని ఫుల్‌టైంగా, పార్ట్‌టైంగా వాడుకొని ఆదాయాన్ని సంపాదించుకునేందుకు అవకాశం ఉంది. రాపిడో క్యాప్టన్ ద్వారా నమోదు చేసుకొని లాగిన్ ఐడీని పొందిన వారికి ఎప్పుడు సమయం దొరికితే అప్పుడు లాగిన్ అయితే చాలు, మూడు కిలోమీటర్ల దూరంలో ఎవరైనా ప్రయాణికులు వాహనం కోసం బుక్ చేసుకుంటే, వెంటనే వారికి సమాచారం వెళ్తుంది. ప్రయాణికుల రిక్వెస్ట్‌ను ఆక్సెప్ట్ చేస్తే రైడ్ బుక్ అయినట్లే. దూరాన్ని బట్టి, ధర ఉండగా, అందులో కొంత రాపిడోకు కమీషన్ రూపంలో వెళ్లి, మిగితాది రైడర్‌కు మిగులుతుంది. ఫుల్‌టైం పని చేసేవారు రూ.800 నుంచి రూ.1200వరకు సంపాదించనుండగా, పార్ట్‌టైం పనిచేసే వారు రూ.200నుంచి రూ.500వరకు సంపాదిస్తున్నారు.

సమీప ప్రాంత ప్రజలకు సౌకర్యం

జిల్లా కేంద్రంలోని ఏ ప్రాంతానికి వెళ్లాలనుకున్నా ఆటో, బైక్‌ల ద్వారా రాపిడో సేవలు అందుతున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి శ్రీరాంపూర్, ఇందారం ఎక్స్ రోడ్డు, హాజీపూర్ మండలంలోని దొనబండ, బెల్లంపల్లి వరకు రాపిడో బుక్ చేసుకొని వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలో మాత్రం బుక్ చేసుకున్న ఐదు నిమిషాల్లోపు వాహనం మన వద్దకు వస్తుండగా, జిల్లా కేంద్రంకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో సేవలు అందడంలో కొంత ఆలస్యం అవుతున్నాయి.

ఉపాధి పొందుతున్న..



రాపిడో సేవలు జిల్లా కేంద్రంలో మొదలైన నాటి నుంచే అందులో చేరాను. ఫుల్ టైం పనిచేసినప్పుడు రోజుకు రూ.800లకు పైగా సంపాదిస్తాను. నాకు పని ఉన్నప్పుడు లాగిన్ కాకుండా ఉంటాను. ఎవరితో సంబంధం లేకుండా కేవలం యాప్ ద్వారానే తమకు రైడ్‌లు రావడం జరుగుతుంది. కుటుంబానికి సమయాన్ని ఇస్తూనే, బైక్ ద్వారా సంపాదిస్తున్నాను.

– దొంగిరి వెంకటేష్, రాజీవ్‌నగర్

ధూమపానానికి దూరంగా ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి రవి

కోటపల్లి: ధూమపానంతో అనేక అనర్థాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ధుమపానానికి దూరంగా ఉండాలని చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. కొల్లూర్ గ్రామంలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ధూమపానం అనారోగ్యానికి గురిచేస్తుందని, ధూమపానం సేవించి రోగాల పాలై ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలు ఉన్నాయన్నారు. పొగాకు ఉత్పత్తులను వాడకూడదని సూచించారు. కార్యక్రమంలో చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్, న్యాయవాదులు కొప్పుల ప్రభాకర్, మహేశ్, మాజీ సర్పంచ్ రమేశ్ రెడ్డి, కార్యదర్శి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి


ప్రచార జాతలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

దండేపల్లి/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి, చదివించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి కోరారు. దండేపల్లి మండలంలోని కన్నెపల్లి, గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట, కొండాపూర్, ద్వారక, ధర్మారావుపేట, మాదాపూర్, మేదరిపేట గ్రామాల్లో, హాజీపూర్ మండలంలోని వేంపల్లి, రాపల్లి, గుడిపేట, టీకానపల్లి, బుద్దిపల్లి, పెద్దంపేటలో, లక్సెట్టిపేట మండలంలోని చందారం, మిట్టపల్లి, ఇటిక్యాల, లక్ష్మీపూర్, దౌడపల్లి, వెంకట్రావుపేట గ్రామాల్లో శనివారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో పిల్లల నమోదుకు ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించబడతాయని వివరించారు. కార్యక్రమాల్లో ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు చంద్రమౌళి, నర్సయ్యలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఏడీఏ సురేఖ

నెన్నెల: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శనివారం భీమిని ఏడీఏ సురేఖ, ఏవో సృజనతో కలిసి తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. అమ్మకాలకు సంబంధించిన, రికార్డులు పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేశామని హెచ్చరించారు. రైతులకు తప్పకుండా రషీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులను పరిశీలించారు. డీలర్లు ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్


మాట్లాడుతున్న బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దిన్

బెల్లంపల్లిరూరల్: ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించడం కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దిన్ అన్నారు. మండలంలోని చంద్రవెల్లిలో తాళ్లగురిజాల ఎస్సై సీ.హెచ్ రమేశ్ ఆధ్వర్యంలో శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన వాహన ధృవీకరణ పత్రాలు లేని 21ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. సైబర్‌నేరాలు, లైంగిక వేధింపులు, ఆత్మహత్యలు, షీ టీమ్ విధులు, డయల్ 100, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. మావోయిస్టు పార్టీలో ఉన్న పుష్ప తల్లిని కలిసి ఆరోగ్య స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు వలీ, తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

చెన్నూర్‌రూరల్: మండలంలో జూన్ 3వ తేదీ నుంచి 20వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మల్లిఖార్జున్ తెలిపారు. ఈ సదస్సుల్లో రైతుల వద్ద నుంచి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. గ్రామాల్లో భూ సమస్యలు ఉన్న వారు దరఖాస్తుతో పాటు సంబంధించిన పత్రాలు జతపరిచి ఇవ్వాలన్నా రు. ఈ సదస్సులను రైతులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. 3న బావురావుపేట, ఆస్నాద, 4న బు ద్దారం, బీరెల్లి, 5న కత్తెరసాల, చాకెపల్లి, 6న చెన్నూర్, దుగ్నెపల్లి, 9న చింతలపల్లి, గంగారం, 10న కాంబోజీపేట, కాచన్‌పల్లి, 11న కన్నెపల్లి, నాగా పూర్, 12న కిష్టంపేట, పొక్కూరు, 13న కొ మ్మెర, సోమనపల్లి, 14న లింగంపల్లి, సుందరసాల, నర్సక్కపేట, 16న సంకారం, గుడ్డిరాంపూర్, అక్కెపల్లి, 17న కోనంపేట, అముదాలపల్లి, 18న రాయిపేట, నారాయణపూర్, ఆదివార్‌పేట, శివలింగాపూర్, 19న ఎల్లక్కపేట, సుద్దాల 20న అంగ్రాజ్‌పల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యలయాల వద్ద నిర్వహించబడుతాయని పేర్కొన్నారు.

దండేపల్లి: భూసమస్యల పరిష్కారం కోసం జూన్ 3నుంచి 20వ తేదీ వరకు దండేపల్లి మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న తానిమడుగు, బిక్కనగూడ, 4న కుందేల్‌పహాడ్, లక్ష్మీకాంతపూర్, 5న కొర్విచెల్మ, అల్లీపూర్, 6న రెబ్బనపల్లి, గుడిరేవు, 9న ధర్మారావ్‌పేట, తాళ్లపేట, 10న గూడెం, నాగసముద్రం, మాకుల్‌పేట, 11న కాసిపేట, మేదరిపేట, 12న మామిడిపల్లి, పెద్దపేట, రొల్లపహాడ్, 13న ముత్యంపేట, చింతపల్లి, 16న నంబాల, దండేపల్లి, 17న వెల్గనూర్, నర్సాపూర్, 18న వెంకటాపూర్, కొండాపూర్,19న జైదపేట, అందుగులపేట, ద్వారక, 20న కన్నెపల్లి, లింగాపూర్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జైపూర్: మండల వ్యాప్తంగా 20గ్రామ పంచాయతీల్లో జూన్ 3నుంచి భూసమస్యల పరిష్కారానికి చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వనజారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న బెజ్జాల, ముదిగుంట, 4న నర్సింగాపూర్, మిట్టపల్లి, 5న మద్దుపల్లి, నర్వ, 6న కుందారం, జైపూర్, 9న శివ్వారం, పెగడపల్లి, 10న పౌనూర్, గంగిపల్లి, 11న గోపాల్‌పూర్, ఎల్కంటి, 12న వేలాల, షెట్‌పల్లి, 13న కిష్టాపూర్, టేకుమట్ల, 16న, రొమ్మిపూర్, ఇందారం, 17న కాన్కూర్, కాచిన్‌పల్లి, 18న రామారావుపేట గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పట్టా భూములకు సంబంధించి సమస్యలపై రైతులు దరఖాస్తులు అందించాలన్నారు.

మంత్రిని కలిసిన పంచాయతీ రాజ్ ఉద్యోగులు


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న డీపీవో, ఉద్యోగులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాలకు వచ్చిన పంచాయతీ రాజ్ శాఖా మంత్రి సీతక్కను శనివారం జిల్లా పంచాయతీ రాజ్ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ కుమార్‌దీపక్ సమక్షంలో మంత్రి సీతక్కను కలిసిన వారిలో జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) వెంకటేశ్వర్‌రావుతో పాటు డీఎల్‌పీవో సఫ్దర్‌అలీ, మండల పంచాయతీ అధికారులు(ఎంపీవో) శ్రీపతి బాపూ, అజ్మత్‌అలీ, శ్రీనివాస్ ఉన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, వెహికిల్ అలవెన్స్‌లు మంజూరు చేయించేలా చూడాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

జన్నారం: మండలంలోని పుట్టిగూడ, బాదంపల్లి గ్రామాల మధ్య గల ఇరుకువంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి రూ.1.54కోట్లు మంజూరు చేసినందుకు గాను శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటానికి పుట్టిగూడ, బాదంపల్లి గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ ఆలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు సయ్యద్ ఇస్సాక్, భూమన్న, కరుణాకర్, ఏఎంసీ డైరెక్టర్ సత్తయ్య, నాయకులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

పాతమంచిర్యాల: తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా జిల్లాకు చెందిన వడ్డేపల్లి మనోహర్‌ను నియమించినట్లు తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి తమ అసోసియేషన్ సేవలందిస్తుందన్నారు.

యోగాతో మానసికోల్లాసం

తాండూర్: యోగాతో మానసికోల్లాసం కలుగుతుందని తాండూర్ పీహెచ్‌సీ వైద్యురాలు ఝాన్సీ అ న్నారు. అంతర్జాతీయ యోగా డే దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం పీహెచ్‌సీ ఆవరణలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగా భా గం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శృతి, ఫా ర్మసిస్టు శ్రీనివాస్, యోగా శిక్షకుడు చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం'


మాట్లాడుతున్న వెరబెల్లి రఘునాథ్

పాతమంచిర్యాల: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ లక్ష్యమని, ఫౌండేషన్ చైర్మన్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో శనివారం డిగ్రీ, ఇంటర్మీడియట్ చదివిన విద్యావంతులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా 200మంది డిగ్రీ, ఇంటర్మీడియట్ చదివిన యువకులు జాబ్‌మేళాకు హాజరు కాగా హైదరాబాద్ ఎంఎస్ఎన్, ఐటీసీ న్యూలాండ్ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. భవిష్యత్‌లో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించి యవతకు ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, జోగుల శ్రీదేవి, అమిరిశెట్టి రాజ్‌కుమార్, బొయిని హరికృష్ణ, బింగి సత్యనారాయణ, శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

నస్పూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా జూన్ 2న కొత్తగూడెం, శ్రీరాంపూర్ ఏరియాల్లో నిర్వహించే ఉత్సవాల్లో శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైనవారికి సన్మానం చేయనున్నారు. ఆర్కే 6 గనిలో డీవైఎస్ఈగా విధులు నిర్వర్తిస్తున్న శ్యామ్‌కుమార్‌కు కొత్తగూడెం, ఆర్కే 6 గనిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ నజీరుద్దీన్‌ను శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో జరిగే ఉత్సవాల్లో అధికారులు సన్మానించనున్నారు.

మందమర్రి ఏరియాలో 65శాతం బొగ్గు ఉత్పత్తి


వివరాలు వెల్లడిస్తున్న ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో మే నెలలో 65శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఏరియా జీఎం దేవేందర్ పేర్కొన్నారు. జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేకే–5గనిలో 17,064టన్నులు, కాసిపేట గనిలో 14,163, కాసిపేట–2 గనిలో 11,910, శాంతిఖనిలో 7,328, కేకే ఓసీలో 95,041టన్నులు ఉత్పత్తి జరిగినట్లు తెలిపారు. మొత్తంగా 2,24,000టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా కేవలం 1,45,506టన్నుల ఉత్పత్తి జరిగినట్లు తెలిపారు. కేకే–ఓసీలో అనుకున్నంత బొగ్గు ఉత్పత్తి జరగలేదని, అండర్‌గ్రౌండ్ గనుల్లో కార్మికుల గైర్హాజర్ ఎక్కువగా ఉన్నందునా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించలేదని వివరించారు. 2025–26ఆర్థిక సంవత్సరంలో బొగ్గుఉత్పత్తి లక్ష్యసాధన కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు ఏరియా ఉద్యోగులు సహకరించాలని జీఎం కోరారు. సమావేశంలో ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ ఆఫీసర్ శ్యామ్‌సుందర్, ఐఈడీ రాజన్న, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ తదితరులు ఉన్నారు.

మేనేజర్‌కు ఘన వీడ్కోలు


ఆర్కే 6 గని మేనేజర్ దంపతులను సన్మానిస్తున్న ఏజెంట్ శ్రీధర్

శ్రీరాంపూర్: ఆర్కే 6 గని మేనేజర్‌గా పనిచేసి అదే గనిలో రిటైర్డ్ అయిన మేనేజర్ ఈర్ల తిరుపతిని గని అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గనిపై శనివారం జరిగిన కార్యక్రమంలో తిరుపతి–ఉమాదేవి దంపతులను గ్రూప్ ఏజెంట్ ఎస్.శ్రీధర్ శాలువాతో సత్కరించి వారు చేసిన సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ తర్వాత శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, వెంటిలేషన్ అధికారి రాంనరసయ్య, పిట్ ఇంజనీర్ శ్యాంకుమార్, సంక్షేమ అధికారి సురేందర్, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

రిటైర్డు కార్మికుడికి సన్మానం


సత్తయ్య దంపతులను సన్మానిస్తున్న నాయకులు

తాండూర్: బెల్లంపల్లి ఏరియా అబ్బాపూర్ ఓపెన్‌కాస్ట్‌గనిలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన కార్మికుడికి శనివారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. సీనియర్ మైనింగ్‌సర్దార్‌గా పని చేసి రిటైర్డు అయిన పార్వతి సత్తయ్య దంపతులకు పూల మాల వేసి శాలువా కప్పి సన్మానం చేశారు. శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఓపెన్ కాస్ట్ గనిలో..

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో రిటైర్డ్ అయిన కేతిరెడ్డి రంగారెడ్డి, పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, తంగళ్లపల్లి రామచందర్‌లను గని అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి టీ.శ్రీనివాస్, గని మేనేజర్ ఐ.శ్రీనివాస్, గుర్తింపు సంఘం నాయకులు రాచర్ల చంద్రమోహన్, ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, రక్షణాధికారి జీ.శ్రీధర్ పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం


సన్మానిస్తున్న కమాండెంట్ వెంకటరాములు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఆర్ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరంగం శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కమాండెంట్ వెంకటరాములుతో పాటు తోటి ఉద్యోగులు, సిబ్బంది అంతా కలిసి శ్రీరంగం దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. విరమణ అనంతరం సుఖశాంతులతో, ఆరోగ్యంతో శేష జీవితం గడపాలని కోరుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.